మీ కబ్బినట్లే కబ్బము దానికి వచ్చినది. ఏమని వ్రాసినది?" అని వెనుదఱిమినది జాబు నందిపుచ్చుకొనుటకై. జాబు నీయకయే తిరువెంగళుండు "నాపై నీవు వైచిన ఋజువుభారము తీర్చివేసితినా లేదా యిప్పటికైన దీర్చివేసితినా లేదా?" అని అడిగినాడు. ఆ ముక్క వినిపించుకొనకయ, ఉత్తరము చూడకయ యాండాళ్ళమ్మన్నది "మఱైన నెప్పుడు తీసికొనివత్తు రల్లినిల్లఱికము?" అని అడిగినది. "ఔరా! నీవటవే యా యుత్తరము వ్రాయించినది" అని ఆశ్చర్యపోయినాడు తిరువెంగళుండు. ఆండాళ్ళమ్మ చిరునవ్వు నవ్వుచూ "మాటలు నావీ కవిత్వము మీది" అంది.

ఆ చిరునవ్వు ఫలశ్రుతి యెంతవఱకు వ్రాసిన వ్రాయవచ్చు గ్రంథవిస్తరభీతి విడిచినచో—తిరువెంగళాచార్యులకు దత్తత వ్యామోహము నశించినది. అల్లుడిల్లఱికము వచ్చినాడు. కళ్యాణియే వానికి గొడుకునుం గూతుకయునై కష్టసుఖంబుల దలలో నాలుకవలె మెలంగినది. అనతికాలములో బుత్రు నెత్తి కొని కళ్యాణీ "యిదుగో! పుత్రికా పుత్రుడు" అని తన తండ్రి తొడలం గూరుచుండబెట్టి వానికి బుత్రుడు లేని లోపము దీర్చినది.

.... .... .... .... ....

## వన్నెలాంగి - సన్నుతాడి

హిందూ సంఘమునం దొక తెగ మనుష్యులకు ఊరిలో నిలువ నీడ యుండదు. ఊరి వెలుపలనే వారి గూడెమూ వారి గోష్ఠి. కాని తెల్లవాఱి లేచి చూచునంత నూరునంతను బరిశుభ్రము

చేయువారు వారే. వారి నేమేని యనుడు ; అంటరానివా రనుడు, ముట్టరాని వారనుడు, వారిపీడ నగ్రజాతులవారు త్రొక్కరానివా రనుడు. వారున్నారు. నిరంతర మున్నారు. వారుండకున్న సాంఘిక జీవనము నడువనే నడువదు. సాంఘిక జీవనము నడువకపోవుటయేకాక సాంఘిక జీవనమం దొకానొక వినోద మీ పాటికి నశించిపోయి యుండెడిది కూడను.

"కుంతి" యుత్సవమున కని యేటేట నట్లతద్దికి నొక నెల ముందునుండియు నింటింటను వాడ వాడను "రామో రామ రామయ్య" యనుచు డబ్బులు వసూలుచేసికొని యా మొత్తము నంత నయ్యుత్సవమునకై యట్లతద్దినాటి రాత్రి వ్యయపఱచి మిక్కిలి వినోదము గల్గించువారు ఆ జాతివారే. ఈయది నేనింత మట్టునకు నొత్తివ్రాయుటకుఁ గారణము—ఒకడు దినదినము వీధితుడుపువాఁడు మహారాజు వేషము ధరించువాఁడు. మఱి యొక్కరుఁడు దినదినము కుళ్ళునీళ్ళు తోడువాడచ్చ వైదిక బ్రాహ్మణుని వేషము వేయువాఁడు. ఇట్లే నలుగు రైదుగు రాజాతివారలే మఱి కొందఱు కోమటివేషము, రాజ్ఞివేషము, రయితువేషము, దొరవేషము, దొరసానివేషము, రకరకముల వేషంబు లన్నిటినిం దాల్చి యుత్సవంబుతోపా టొకనడక—నాటకము సాగింతురు.

మనము పోల్చలేము వాఁడే వీఁడని. "అనుదినము వీరింత పరిశుభ్రముగ నగ్రజాతులవారి వైఖరి నీ ఫక్కి ననుసరించిన బాగుండి పోయెడిదేమో సంఘమునకు వెలిగాకుండ నుండెడి వారలేమో" అని కూడ నొక్కొక్కప్పుడు యోజింపఁ జెల్లును. కాని నటనమునకు నాటకమునకు నప్పుడు అవకాశ

ముండదు. అదియొక పెద్ద సమస్యయే. దానిని సాంఘిక శాస్త్రజ్ఞులకు వదలి సారస్వత ప్రియులు గోరు వినోదమునే యుగ్గడింతునుగాక.

ఒకరుఁడు కథానాయకుని వేషము వేసినవాఁడు. "వన్నెలాంగి - సన్నుతాడి!" అని యెలుంగెత్తి కథానాయకీవేషధారిని పిలుచుచున్నాడు. గంతులు వైచుచున్నాడు. చేయిపట్టి లాగుచున్నాడు. తాను తూగుచున్నాడు. చుట్టును మ్మూగిన చూపఱు యొకప్రక్క, బాజా భజంత్రీవాం డ్రొకప్రక్క, పేరంటాం డ్రొకప్రక్క "అజారే! అయ్యారే" అన్నట్లాకృష్ణులై కన్నులు దోరవెట్టుకొని చూచుచున్నారు. "అహో! రాజువేషము వానికే తగును. రాణివేషము దానికే—కాదు వానికే తగును" అని గుజగుజలు వోవుచున్నారు. "రాజువేషము వేసినవాఁడు కుఱ్ఱవాఁడు రాజకుమారుఁడే. రాణివేషము వేసినదియు కుఱ్ఱవాఁడే కాని అడంగి టక్కుటెక్కులు బలేగా చూపుచున్నాడు" అని కొందరు కనుబొమ లెగయించుట కూడఁ జేయుచున్నారు.

"వన్నెలాంగి - సన్నుతాడి" అని పునః ఎలుంగెత్తి కథానాయకుఁడు లాగినాఁడు కథానాయకిని.

మనః ఫలకముపైఁ జిత్రింప దొరకొన్నయల నాట్యనటన మొక వెలివాడ వాఁడుత్తమ క్షత్రియ వేష మూనుటయ కాక, యొక మగవాఁ డొక యాడుదానివేషము ధరించుటయు నమ్మగవాని దన్నటనమున మఱొక్క మగవాఁడు వలచినట్ల తలపోసికొనుచు సంబోధించుటలో "వన్నెలాడి - సన్నుతాంగి" అనుటకు మాఱుగ "వన్నెలాంగి - సన్నుతాడి" అని దుఃజచుటయును—

ఊహింపు డెంతటి వినోదంబున కయ్యది కారణభూతమో-నేను నవ్వుచున్నాను. నా నవ్వుచూచి కాంబోలు వారిలో నొక తజ్జుడు "ఒరేవు అర్థం తెలిసి ఆడరా, బాబులు నవ్వుచున్నారు. వన్నెలాంగి - సన్నుతాడి కాదులాగుందిరా "వన్నెలలంగా - సన్నులతాడి" అని చదవరా" అన్నాడు. ఇంక నా నవ్వుకు పట్టశక్యమే లేకపోయింది.

.... .... .... .... ....

## ఉద్యోగపు టుద్ది

"ఉప్పు, గంజా, కల్లు, సారా, నల్లమందు" శాఖలో ఇన్‌స్పెక్టరు పదవికి వచ్చేసరికి మంచిజీతం ఇస్తారు. పెద్ద ఆఫీసొకటి అతని చేతిక్రింద పనిచేస్తూవుంటుంది. శుభ్రమైన బంగాళాభవనం అతని కమారు. మోటారుకారు, పెట్రోమాక్సుదీపం కలిగివుండే దర్జా అలవడుతుంది. అతగాడి యిల్లాలు పడక్కుర్చీలో వ్రాలి "లండనుటైమ్సు" వో, లేకపోతే "ఇలస్ట్రేటెడ్ టైమ్సు" వో, తెనుగు వారైయినా "భారతి" వో, "గృహలక్ష్మి" వో పుటలు తిరగేస్తూవుండే నవనాగరీకంలో పడుతుంది. పిల్లలు త్రోపుడు బళ్ళల్లోనూ, త్రయచక్రశకటాలమీదనూ నవుకర్లు త్రిప్పుతూవుంటే నవ్వుతూవుంటారు. ఎప్పుడూ ఏడువరు. వంట మనిషి వంట చేస్తూంటే, తోటమాలి మొక్కలకు నీళ్లపోస్తూంటే అరక్రీగంట మెళ్లో హారాలు సవరించుకుంటూ వుంటారు ఎదిగిన కూతుండ్రు, కోడండ్రు. ఆ శాఖలో ప్రతి ఇన్‌స్పెక్టరుభోగం